క్లుప్తంగా

75 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం వృద్ధులకు ఆలంబనగా నిలుస్తుందని ఉప్పులూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు సబ్ సెంటరులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 75 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, మందులు అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది వై.ఝాన్సీకుమారి, జి.అనిత, ఐఎస్‌బీఎస్ కుమారి, కె.స్వరూప పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



కంకిపాడు: పేదలను ఆదుకోవటం సామాజిక బాధ్యత అని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో కంకిపాడు, ఈడుపుగల్లు గ్రామాలకు చెందిన పేదలకు ఈస్టర్ పండుగ పురస్కరించుకుని నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం శనివారం అందించారు. ధనేకుల ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో రావి రాజేష్, షేక్ షకార్, పర్వతనేని రవి, పి.రామకృష్ణ, బుజ్జి, కాకుళ్ల సుధాకర్, విజయవాడ రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు, కార్యదర్శి కోమటి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కంకిపాడు: పట్టణంలోని ప్రధాన సెంటరులో చెన్నకేశవస్వామి దేవస్థానం భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఆలయ ఆచార్యులు హరిబాబు, స్థానిక ప్రతినిధులు శేగు నరసింహారావు, మారం వెంకట అయోధ్యరామారావు, గ్రంధి సత్యనారాయణ, గ్రంధి రామకృష్ణ, చెక్కా ఆనంద్, నంది కేశవ రావు, విస్సంశెట్టి మురళీకృష్ణ, మానేపల్లి సాయి పాల్గొన్నారు.

పోరంకిలో మహిళపై దాడి

పెనమలూరు: పోరంకిలో మహిళపై ఆమెతో కలిసి ఉండే వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్‌నగర్‌లో బి.సౌజన్య తల్లితండ్రులతో కలిసి ఉంటుంది. ఆమె గత 15 సంవత్సరాలుగా ఫణికుమార్ అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉంది. వీరికి బాబు ఉన్నాడు. అయితే ఫణికుమార్ మరో వివాహం చేసుకుని సౌజన్యకు దూరంగా తాడిగడపలో ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీన సౌజన్య తాడిగడపలో ఉన్న ఫణికుమార్ వద్దకు వెళ్లగా గొడవ జరిగింది. కాగా శుక్రవారం చర్చికి వెళ్లి ఇంటికి వచ్చి పడుకున్న సమయంలో సౌజన్య పై ఫణికుమార్ బీరు సీసాతో దాడి చేశాడు. ఈ ఘటనలో సౌజన్యకు గాయాలు అవ్వటంతో ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు.

పరీక్ష కేంద్రాలు తనిఖీ చేసిన డీఈవో

గన్నవరంరూరల్: మండలంలోని 10వ తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం డీఈవో తాహెరా సుల్తానా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొల్లనపల్లి, ముస్తాబాద హైస్కూళ్లను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలించారు. ఎంఈవో బి.శ్రీనివాస్ ఆమె వెంట తనిఖీలో పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

గన్నవరంరూరల్: కొత్తగా అర్హత ఉన్న రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌ఎల్ తేజశ్వి సూచించారు. ఆమె శనివారం మాట్లాడుతూ 2023వ సంవత్సరానికి కొత్తగా అర్హత పొందిన వారు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. గత సంవత్సరం లబ్ధి పొందిన రైతులు కొత్తగా రిజిస్ట్రేషన్ అవసరం లేదని, కొత్తగా అర్హత ఉన్నవారు మాత్రమే నమోదు చేసుకోవాలని, వారికి రైతు భరోసా వస్తుందని వివరించారు.

17న వాహనాల బహిరంగ వేలం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు సీతారామపురంలోని విజయవాడ వెస్ట్ ఎస్‌ఈబీ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఈ.స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 4 వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగా ఉన్నవారు ఈ నెల 17వ తేదీ నిర్వహించే వేలంలో పాల్గొవాలన్నారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలని చెప్పారు. ఈఎండీ కింద టూవీలర్స్‌కు రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఆ మొత్తాన్ని పాట అనంతరం తిరిగి చెల్లిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94409 02455, 99595 10446 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్న నాయకత్వంలో సంక్షేమ పాలన

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరులో గడప గడపకు మన ప్రభుత్వ కార్య క్రమంలో పాల్గొని సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు:రాష్ట్రంలో జగనన్న నాయకత్వంలో సంక్షేమ పాలన చాలా బాగుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని లబ్ధిదారుడు వెంకటసుబ్బారావు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం కానూరు సచివాలయం 3 పరిధిలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పర్యటించి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల బ్రోచర్ అందచేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేశారన్నారు. నేడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని అన్నారు. మరల జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని తెలిపారు. కాగా స్థానికంగా పారిశుద్ధ్యం అమలు సక్రమంగా లేదని, మురుగునీరు రోడ్డు పైకి వస్తుందని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాము..

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాలు అమలు చేశామన్నారు. నేడు ప్రజలు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. మరలా జగనన్నను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఎంతో భరోసాగా జీవించవచ్చని చెప్పారు. తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, అంగిరేకుల సీతారామయ్య, ఈదా రాజేష్, తుమ్మల వరదీష్, పిన్నబోయిన రవి, ఆంజనేయప్రసాద్, అంబటి రమేష్, యువరాజు, ఆసీఫా, కందుల వంశీ పలువురు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం సీఎం జగన్ ధ్యేయం



గృహ సారథులకు కిట్లను అందిస్తున్న కొమ్మా కోటేశ్వరరావు తదితరులు

రామవరప్పాడు: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం–3లో శనివారం 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు వాల్ పోస్టర్లు, స్టిక్కర్లతో కూడిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మా కోట్లు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నాలుగేళ్ల పాలనలో మా నమ్మకం నువ్వే జగన్ అన్నది ప్రజల నినాదంగా మారిపోయిందన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అమలవుతున్న విధానాన్ని ప్రతి గడపకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పలు రాష్ట్రాలు సీఎం జగన్ పాలనను ఆదర్శంగా తీసుకుంటుంటే ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు పన్నుతున్న కుట్రలను మనందరం కలిసి తిప్పికొట్టాలని, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంఘం అధ్యక్షులు బిందుల కిరణ్‌రాజ్, రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు దూరు రత్నం, పైలా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామవరప్పాడు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజల కృతజ్ఞత



కాకులపాడులో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎంపీపీ నగేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రతి మేలుకు ప్రజలు ఎంతో కృతజ్ఞత చూపుతున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం కాకులపాడులో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. ప్రతి ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారి అనుమతితో తలుపులు, గేట్లకు అంటించారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించి, ఆ పత్రంపై ఉన్న నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వారి ఎదుగుదలను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు, సర్పంచ్ కాజా ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరు గ్రామంలో శనివారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, మండల సచివాలయాల కన్వీనర్‌లు, గృహసారథుల కన్వీనర్ కైలే శివకుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రభుత్వ పాలనకు వ్యత్యాసం గమనించాలని కోరారు. సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. పర్యటనలో సానుకూల స్పందన లభించింది. అనంతరం గృహ యజమానుల అభీష్టానుసారం వారి గృహాలకు మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌లను అంటించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కంచర్ల నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్‌వీఆర్, గొంధి పరంధామయ్య, యేగి జోజిబాబు, ఓబిళనేని బ్రహ్మయ్య, కలపర్తి శౌరికుమార్ పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కిట్ల పంపిణీ

దావాజిగూడెం(గన్నవరం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమష్టిగా పనిచేయాలని ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి సూచించారు. మండలంలోని దావాజిగూడెంలో ఉన్న ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో ''జగనన్నే మా భవిష్యత్''పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు జగనన్నే మా భవిష్యత్ కిట్లను అందజేశారు. అనంతరం ఉత్తమ అవార్డు అందుకున్న బుద్ధవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నక్కా కృష్ణయ్య, కార్యదర్శి ప్రసాద్‌ను సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఉపసర్పంచ్ వేల్పూరి బవసరావు, పార్టీ నేతలు కైలే శివకుమార్, జలసూత్రం రామ్మోహన్‌రావు, నాగనబోయిన గిరీష్‌రాజు, గుర్రం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రంలో పాము కలకలం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం డీఈఓ తాహెరా సుల్తానా సందర్శించారు. పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఇంగ్లిషు పరీక్ష జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. హెచ్‌ఎం ఎన్.రవీంద్ర భవాని, పలువురు అధికారులు పాల్గొన్నారు. అయితే డీఈఓ వెళ్లిన కొద్దిసేపటి తర్వాత పాఠశాలలోకి పాము ప్రవేశించడం కలకలం రేపింది. తొలుత హెచ్‌ఎం రూమ్‌లోకి పాము రావడం గమనించిన సిబ్బంది హడావుడి చేయడంతో అది అక్కడ నుంచి పదవ తరగతి పరీక్ష జరుగుతున్న 7వ నంబర్ రూమ్‌లోకి వెళ్లింది. పామును గమనించిన పరీక్ష రాస్తున్న విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఓ ఉపాధ్యాయుడు ధైర్యం చేసి పామును కర్రతో కొట్టి చంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ పాము విషపూరితం కాని జర్రిగొడ్డు జాతికి చెందినదిగా సిబ్బంది గుర్తించారు.

సాహితీ కళారంగాల వేదిక విజయవాడ



మాట్లాడుతున్న శంకరరావు, వేదికపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ తదితరులు

విజయవాడకల్చరల్: సాహితీ కళా రంగాల వేదిక విజయవాడ అని హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు అన్నారు. గాంధీనగర్‌లో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన హనుమంతరాయ గ్రంథాలయ కళావేదిక ప్రారంభోత్సవానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ హనుమంతరాయ గ్రంథాలయాన్ని ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రూ.30 లక్షలతో ఆడిటోరియాన్ని ఆధునీకరించామని, కళాకారులకు కళాసంస్థలకు అందుబాటులోకి తీసువచ్చామని, గ్రంథాలయానికి, కళావేదికకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కళావేదికను ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ప్రారంభించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. విలువతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రంథాలయ ఆధునిక భవనాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావి శారద ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పరిశోధకులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, వంశీరామరాజు, డాక్టర్ కె.ధర్మారావు, నల్లూరి వెంకటేశ్వర్లు, రంగస్థల నటుడు సంజీవి పాల్గొన్నారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్ష విధులకు హాజరు కాకుండా, అధికారులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని ఎంఏఎంసీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా ఎస్‌కే రియాజుద్దీన్ పనిచేస్తున్నాడు. ఆయనను పదో తరగతి పరీక్షలకు సత్యనారాయణపురంలోని భాష్యం ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం డిపార్ట్‌మెంటల్ అధికారిగా నియమించారు. షెడ్యూల్ ప్రకారం శనివారం పదో తరగతి ఇంగ్లిషు సబ్జెక్ట్ పరీక్ష నిర్వహించారు. రియాజుద్దీన్ శనివారం సెలవుగా భావించి పరీక్ష విధులకు హాజరు కాలేదు. ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ముందస్తు అనుమతి తీసుకోలేదు. పైగా అధికారులకు పదో తరగతి పరీక్ష లేదని సమాధానం ఇచ్చాడు. దీంతో పరీక్ష కేంద్రం వద్ద కొంత గందరగోళం జరిగింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు రియాజుద్దీన్‌ను సస్పెండ్ చేశారు.

ముస్తాబాదలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద గ్రామంలో శనివారం సచివాలయం కన్వీనర్ సయ్యద్ ఆజాం ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది. వలంటీర్‌లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వపరంగా అందజేసిన మేలు తెలిపారు.

కొనసాగుతున్న రంగమ్మ పేరంటాల తిరునాళ్లు

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాలు మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పరిసర గ్రామాలతో పాటు ఉభయ కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు రావడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. తమ వాహనాలు, ప్రభ బండ్లు, పశువులను గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పాడిపంటలతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకుంటున్నారు. అర్ధరాత్రి సమయంలో అమ్మవారి ఊయల సేవ కార్యక్రమం జక్కా వారసుల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ఆ సమయంలో భక్తులందరూ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారిని ఊయల ఊపే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అమ్మవారిని దర్శించుకున్నారు. భీమవరపు యతేంద్ర రామకృష్ణ ఏర్పాటు చేసిన భారీ ప్రభ భక్తులను విశేషంగా ఆకర్షించింది. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

రక్త హీనతను నివారించండి



రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరిస్తున్న శివసాంబిరెడ్డి

పెనమలూరు:రక్తహీనతను నివారించాలని, వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అమలు చేయాలని ఆరోగ్య విద్య విస్తరణ అధికారి బోళ్ల శివసాంబిరెడ్డి అన్నారు. ఎనీమియా ముక్తి భారత్, జాతీయ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న తీరు పై ఆయన శనివారం పెనమలూరు, కానూరు సచివాలయాల పరిధిలో పరిశీలించి వివరాలు సేకరించారు. రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఐరన్ బిల్లలు, సిరప్ సక్రమంగా పంపిణీ చేసి గర్భిణులు, తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో సక్రమంగా వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు పురుషోత్తమరాజు, జి.రామ్‌కుమార్, కెవి.రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో బీజేఆర్‌నగర్ రోడ్డు పనులు



పోరంకి బీజేఆర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

పెనమలూరు:తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకి గ్రామంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బీజేఆర్ నగర్ రోడ్డుకు మహర్దశ పట్టింది. ఈ రోడ్డును రూ.1.40 కోట్లతో సిమెంట్ రోడ్డుగా నిర్మాణం పనులు చేపట్టారు. పోరంకి గ్రామంలో బీజేఆర్‌నగర్‌కు వెళ్లటానికి నిడమానూరు రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉంది. ఈ ప్రాంతంలో పేద కుటుంబాలు నివశిస్తున్నాయి. దశాబ్దకాలంకు పైగా ఈ రోడ్డు నిర్మాణం జరగలేదు. లారీలు తిరగటం వలన బీజేఆర్‌నగర్ పూర్తిగా అధ్వానంగా మారింది. దీని కారణంగా పేద కుటుంబాలు చాలా ఇబ్బందులు పడ్డారు. బీజేఆర్‌నగర్ రోడ్డు పనులు గత ఏడాదిన్నర క్రితమే చేపట్టినా సాంకేతిక కారణాల వలన రోడ్డు పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేకంగా శ్రద్ధ చూపి సీఎస్ఆర్ నిధులు రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆరు మీటర్ల వెడల్పు, కిలోమీటరున్నర పొడవుతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే భవిష్యత్తులో బీజేఆర్ నగర్ పరిసర ప్రాంతం అభివృద్ధి చెందుతాయి. ఆలస్యమయిన బీజేఆర్‌నగర్‌రోడ్డు పెద్ద ఎత్తున నిర్మాణం చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీజేఆర్‌నగర్ రోడ్డు పనుల నాణ్యత ప్రమాణాలతో చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. పూర్తి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయన్నారు. పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. స్థానికులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలి



నూతన వస్త్రాలు, స్వీట్లు, బైబిల్ పంపిణీ చేస్తున్న జయరాజు

గన్నవరం: పేద ప్రజల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు పిలుపునిచ్చారు. స్థానిక స్టేట్ బ్యాంక్ రోడ్డులో శనివారం తమ తల్లిదండ్రులు పోలిమెట్ల మరియన్న, సౌందర్యం జ్ఞాపకార్థం చర్మకార వృత్తిదారులు, రిక్షా కార్మికులు, వితంతువులకు ఆయన నూతన వస్త్రాలు, స్వీట్ బాక్స్‌లు, బైబిల్ గ్రంథాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సీఎం స్ఫూర్తితో తమ తల్లిదండ్రుల పేరుతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణతో తోటి వారికి సాయపడాలని పాస్టర్ గుంద్రపు సురేష్‌బాబు తెలిపారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ గన్నవరం అధ్యక్షుడు వడ్లమూడి రాజు, పాస్టర్లు తిరివీధి పాల్ రాజ్, పల్లేటి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు



వ్యాక్సినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి రత్నగిరి



పెద అవుటపల్లి పీహెచ్‌సీ వద్ద హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి

హనుమాన్‌జంక్షన్ రూరల్: శిశు మరణాలను తగ్గించేందుకు పుట్టిన ప్రతి శిశువుకు తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కె.రత్నగిరి చెప్పారు. బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. మాతృ, శిశు మరణాలను తగ్గించే విధంగా వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఆశ వర్కర్లు తమ పరిధిలో ఇంటింటికీ తిరిగి రక్తహీనత కలిగిన గర్భిణులు, బాలింతలను గుర్తించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా, సీహెచ్‌వో ఎస్.ఫణి కుమార్, ఎంపీహెచ్‌ఎస్ ఎం.అప్పారావు, హెచ్‌వీ అలిమాబి, హెల్త్ అసిస్టెంట్ జి.నాగరాజు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

ఉంగుటూరు: అర్హులైన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఇవ్వాలని హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి అన్నారు. పెద అవుటపల్లి పీహెచ్‌సీని హెల్త్ డైరెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హత ఉన్న ఒక బిడ్డ కూడా మిస్ అవకుండా అందరికీ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌బాబు, పీహెచ్‌సీ డాక్టర్లు హిమబిందు, కరిముల్లా పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిరంతరం ధైర్యం కోల్పోకుండా నెరవేరే వరకూ శ్రమించాలని స్టేట్ ట్యాక్స్(జీఎస్టీ) డెప్యూటీ కమిషనర్ టీఎస్‌బీ నటాషా అన్నారు. పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డులోని నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో కౌన్ ది టాలెంట్ 2022–23 కార్యక్రమం శనివారం ఉత్సాహ వాతావరణంలో జరిగింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నటాషా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు, అన్ని రంగాల్లో రాణించి విశేషమైన ప్రతిభ చూపాలన్నారు. క్రమశిక్షణ, పుస్తక పఠనం అనేవి విద్యార్థి పురోభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం మహిళలకు రంజాన్ జకాత్ అందజేస్తున్న కౌన్సిలర్ అన్వర్ బేగ్

ఉయ్యూరు: రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని 8వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ అన్వర్ బేగ్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని 500 మంది ముస్లిం మహిళలకు రంజాన్ జకాత్‌ను శనివారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ బేగ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ఈ ఏడాది రూ.3 లక్షలు విలువైన జకాత్ (తోఫా) పంపిణీ చేపట్టామన్నారు. దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ మాట్లాడుతూ పేద మహిళలకు చీరలు, దుప్పట్లు, పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. బేగ్ సతీమణి సుల్తానా రజియా బేగం, నాయకులు కొక్కిలిగడ్డ ప్రదీప్, తిరుమలరావు పాల్గొన్నారు.